క్లుప్తంగా

లాలు నాయక్ సేవలు మరువలేనివి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: చెన్నారెడ్డి రెడ్డి గూడ మాజీ సర్పంచ్ మంచర్ల లాలు నాయక్ సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరనిలోటని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన లాలు నాయక్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నారెడ్డి గూడ మొదటి సర్పంచ్‌గా ఆయన ఎన్నికైనట్లు చెప్పారు. సర్పంచ్‌గా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్, చీమల జంగయ్య, ముచ్చర్ల వెంకటేష్, ఎడమ నరేందర్‌రెడ్డి, గుడ్డి మల్ల చంద్రయ్య, మార సురేష్, లాలు నాయక్, శ్రీను నాయక్, కిషన్ నాయక్, స్వామి, లక్ష్మణ్, ఫకీర తదితరులు పాల్గొన్నారు.

కళాభవనం నిర్మించాలి

బీజేపీ నాయకుడు నరేందర్‌రెడ్డి



నరేందర్‌రెడ్డి

కేశంపేట: కళాకారులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ కేంద్రంలో కళాభవనం నిర్మించాలని బీజేపీ నాయకులు కర్రేడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లో వివిధ నాటక పోటీలను నిర్వహిస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం షాద్‌నగర్‌లో కళాభవనం నిర్మిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చాలేదని ఆరోపించారు. అంతరించిపోతున్న నాటకాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

చెల్మారెడ్డికి ఘన నివాళి

మంచాల: తెలంగాణ పోరాట యోధుడు, జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెదెరె చల్మారెడ్డి గొప్ప నాయకుడని మంచాల మండల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆరుట్ల గ్రామంలో చెల్మారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెల్మారెడ్డి చిన్నతనం నుంచే పోరాట పటిమ గల నాయకుడని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రఘుపతి, లాలగారి జంగయ్య, పిడుగు శివ, మజీబ్, పిడుగు సాయి, రాజు, జిల్లామోని సాయి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



గట్టుఇప్పలిపల్లిలో ఆర్థిక సహాయం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలిపల్లికి చెందిన మల్లేపల్లి జంగారెడ్డి, బొర్ర బాలయ్యలు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 3,000ల చొప్పున సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రేణురెడ్డి, రాజశేఖర్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రాయిపల్లిలో..

గ్రామానికి చెందిన రాశపల్లి సత్యమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌లు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటేష్ రూ. 3000, శ్రీనివాస్‌యాదవ్ రూ. 3000 ఆర్థిక సాయం చేశారు. జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ ముజిబుర్ రహ్మాన్, రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన మెతుకుపల్లి లక్ష్మమ్మ ఆదివారం మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, మాజీ ఎంపీటీసీ సురేష్ రెడ్డి పదిహేను వందలు ఆర్థిక సహాయం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న నేతలు

కళాశాల భవనం ప్రారంభమయ్యేనా!

ఏడేళ్లు గడిచినా పూర్తి కాని పనులు

- షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్న తరగతులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



ప్రారంభోత్సవానికి నోచుకోని డిగ్రీ కళాశాల నూతన భవనం

ఇబ్రహీంపట్నం: ఏడున్నర యేండ్లుగా పాలకుల నిర్లక్ష్యం వెరసి కాంట్రాక్టర్ల చిత్తశుద్ధి లోపంతో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోలేదు. ఇబ్రహీంపట్నానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని వినోబానగర్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంత భవన నిర్మాణానికి విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ రూ. 2.25 కోట్ల నిధులు కేటాయించింది. 2016 డిసెంబర్ 12న అప్పటి పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఎంతో ఆర్భాటంగా ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు ఏడున్నర సంవత్సరాల పాటు ఒక అడుగు ముందుకు..నాలుగు అడుగులు వెనకకు అన్న చందంగా నిర్మాణ పనులతోనే సరిపెట్టుకున్నారు.

పిచ్చిమొక్కలు.. పందుల స్వైరవిహారం

ఈ భవనంలో షిఫ్ట్ పద్ధతిలో డిగ్రీ, ఇంటర్ కళాశాలలు నడుస్తున్నాయి. ఉదయం ఇంటర్, మధ్యాహ్నం డిగ్రీ తరగతులను నిర్వహిస్తున్నారు. స్థానికులతోపాటు ఇతర జిల్లాలకు చెందిన సుమారు 600 మంది డిగ్రీ విద్యార్థులు అరకొర సౌకర్యాలతో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసుకొని అందుబాటులోకి వస్తుందని ఇటు విద్యార్థులు, అటు అధ్యాపకులు భావించారు. కాని అందుకు భిన్నంగా యేండ్లు గడుస్తున్నా నూతన భవనం ప్రారంభోత్సవానికి నోచుకోక తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురౌతున్నా రు. పిచ్చి మొక్కలతో, పందులు స్వైరవిహారం చేస్తూ కళాశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.



భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

ఈ విద్యా సంవత్సరంలోనైనా మొదలవుతుందా..?

డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులకు జులై 1నుంచి, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 17 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. యేడాదిన్నర క్రితం ఓ పత్రికలో అసంపూర్తి నిర్మాణంపై కథనం రావడంతో అప్పట్లో అదనంగా మరో రూ.30 లక్షలకుపైగా నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో నూతన భవనానికి రంగులు వేయడానికి, చిల్లర పనుల వరకూ సరిపోయాయి. కళాశాల ప్రహరీ నిర్మాణం, కావాల్సిన ఫర్నీచర్ తదితర సౌకర్యాలకు నిధులు కొరత ఏర్పడింది. సుమారు మరో రూ. 10లక్షల వరకూ నిధులు కేటాయిస్తే ఈ భవనం నిర్మాణపనులు పూర్తవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం చొరవ తీసుకుని డిగ్రీ కళాశాల పూర్తి చేయడానికి కొంత నిధులు కేటాయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

జూనియర్ కళాశాల భవనంలో షిఫ్ట్ పద్ధతిలో 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నూతన భవనం దాదాపు నిర్మాణం పూర్తయింది. ఫర్నీచర్, భవనం చుట్టూ ప్రహరీని నిర్మిస్తే త్వరలో అక్కడ తరగతులను ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. – ప్రభు, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం

పాలకుల నిర్లక్ష్యం



రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన విద్యార్థుల సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఈ యేడైనా డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం అవుతుందని ఆశపడ్డాం. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. ప్రత్యేక రాష్ట్రం వస్తే విద్యార్థుల వెతలు తీరుతాయని ఎంతో ఆశతో ఎదురుచూసాం. విద్యార్థుల ఇబ్బందులను పాలకులు పట్టించుకోవడంలేదు. – తరంగ్, ఎస్ఎఫ్ఐ, డివిజన్ కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

నిధులు కేటాయించాలి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో డిగ్రీ కళాశాల భవనానికి స్థలాన్ని కేటాయించి రెండున్న కోట్లతో నిర్మాణం చేపట్టింది. పనులు తుది దశకు వచ్చాయి. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చి 8 నెలలు కావస్తుంది. డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కావాల్సిన కొద్దిపాటి నిధులను సమకూర్చాలి. పూర్తి స్థాయి భవన నిర్మాణానికి, విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలి. – మహేశ్, బీఆర్ఎస్ నేత, ఇబ్రహీంపట్నం

దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



కడ్తాల్: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి

కడ్తాల్: విలువల వైతాళికుడు ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఆదివారం హైదరాబాద్‌లోని స్మృతి వనంలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

మండల కేంద్రంలో...

మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, భాస్కర్ రెడ్డి, హన్మానాయక్, వేణుగోపాల్, జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, హీరాసింగ్, లక్పతినాయక్, లక్ష్మణ్, మల్లేశ్‌గౌడ్, అశోక్, శ్రీను, రవి, ఇమ్రాన్, షాబుద్దీన్, యాదయ్య, పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి నాగలి బహూకరిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

రైతును రాజు చేయడమే లక్ష్యం: కిషన్ రెడ్డి

మాడ్గుల: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాజీ మంత్రి జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కోట్ల చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ వేదికలో భాగంగా బట్టు కిషన్ రెడ్డి మాట్లాడారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పేర్కొన్నారు. మాజీ మంత్రి జైపాల్ రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి నాగలి బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అషాడమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయాకాలనీల్లో భక్తులు అమ్మవారి ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని సాయిబాబాకాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగకు ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లతశ్రీ శ్రీశైలంగౌడ్, మాజీ కౌన్సిలర్ విజయకుమార్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



షాబాద్: పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని హైతాబాద్ గ్రామంలో బోనాల జాతర సందర్భంగా పోచమ్మ, ఈదమ్మ దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే, మధుసూదన్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల వద్దకు వెళ్లినప్పుడు నిష్ఠతో పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు ఖాజామియా పటేల్, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సత్యం యాదవ్, మహ్మద్ జానీ, వెంకట్‌రెడ్డి, కుద్దూస్, బురాన్, యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, అనంత రెడ్డి, శ్రీనివాస్, శేకర్, ప్రశాంత్, శ్రీరాములు, గ్రామస్తులు తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2007–08బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగల్‌పల్లిలోని ఆదిత్య కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఎన్నో సంవత్సరాల తరువాత వారు ఒకే చోట కలిసి తమ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ నాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. స్కూల్లో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. 16 సంవత్సరాల తర్వాత అందరూ ఒకే చోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొప్పు జంగయ్య, రాఘవచారి, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్, గోవింద్, దూస జంగయ్య, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



తలకొండపల్లి: పాతకోట తండాలో పల్లకీ మోస్తున్న ఉప్పల వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పాతాకోట తండాలో శనివారం గిరిజనులు బోనాలు ఘనంగా జరిపారు. తండా ప్రధాన వీదుల మీదుగా అమ్మవారి ఊరేగింపు చేశారు. శివ సత్తుల పూనకాలు, పోతు రాజుల విన్యాసాలు, డప్పుడోలు, వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఊరేగింపు రథాన్ని మోశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, శ్రీశైలంగౌడ్, గణేష్, నరేష్, శేఖర్, సురేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని రాగన్నగూడ సూరజ్‌నగర్, రాఘవేంద్ర నగర్‌లో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



తుర్కయంజాల్: బోనం ఎత్తుకున్న మహిళలు

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ పరిధి కల్వకుర్తి పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.



దేవుని పడకల్ నుంచి సభకు తరలుతున్న నాయకులు

కులవృత్తులకు ప్రోత్సాహకం అందించాలి



డప్పులు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామాల్లో కులవృత్తులు చేసుకునే వారికి తగిన ప్రోత్సాహకం అందించాలని పామెన మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో ఆదివారం డప్పులు వాయించే వృత్తిదారులకు మాజీ సర్పంచ్ దవాల్‌గారి గోపాల్‌రెడ్డి తన తండ్రి మానిక్యరెడ్డి జ్ఞాపకార్థం వారికి డప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలో ఉండే అన్ని వృత్తుల వారు కలిసి మెలిసి ఉంటూ పండుగలను జరుపుకోవటం అనవాయితీగా వస్తుందన్నారు. ప్రస్తుతం బోనాల ఉత్సవాలు అన్ని గ్రామాల్లో జరుగుతున్నాయని ఈ బోనాలు ఉత్సవాలు అంటే ముందుగా గుర్తుకు వచ్చేది డప్పుల చప్పులు. కావునా, కొత్త డప్పులను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి ఎర్ర గోపాల్, గ్రామ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు బాబు, వెంకటేశ్, విజయ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, తిరుమలయ్య, శివయ్య, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

- అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసిందేమీలేదు
- బీఆర్ఎస్ కొత్తూరు మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ కొత్తూరు మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గిరిజనులకు చేసిందేమిటని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు మతిలేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు మెప్పుకోసం విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. గిరిజన నాయకుడు రాంబల్‌నాయక్‌ను విమర్శించే స్థాయి మీది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండాల్లో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటుగా గిరిజనుల సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని అన్నారు. పట్టణంలో బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన బంజారాభవన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తే గిరిజన జాతికి మేలు జరుగుతుందని చెప్పారు. ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తండాలకే ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రామునాయక్, మోహన్‌నాయక్, సుధాకర్, మోహన్, రాజునాయక్ పాల్గొన్నారు.